# నాయిన్న

**ఇల్లంతా** కోలాహలంగా ఉంది. ఊర్లో బోనాలపండుగ ఉంది. అల్లుడు కూతురు, కొడుకులు, ఇల్లునిండారు. వంటింట్లోంచి పోపు వాసన ఘుమఘుమలాడుతుంది. అందరూ సంతోషంగా ఉన్నారు.

నాయిన్న లింగంకు మాత్రం దిగులుగా ఉంది. తన దిగులును బయటకు కనబడ నీయకుండా పైపైన చిరునవ్వును పులుముకుని అల్లుడితో మాట్లాడుతున్నాడు. ఆరోజెందుకో అనుక్షణం పెద్దకొడుకే గుర్తుకొస్తున్నాడు. కళ్ళముందు కదులున్నట్టే ఉంది. ఐదేండ్ల క్రితం జీవితాన్ని ఇప్పటి తన జీవితంతో పోల్చుకున్నాడు. అన్నింటికి మించి పండుగ రోజుకూడా 'పెద్దకొడుకును' ఎవరూ గుర్తు చేయకపోవడం అతనికి బాధను కలిగించింది. 'నేను మస్కట్ పోయినప్పుడు నన్నూ గిట్లనే మీదికి జెయ్యలేదు గావచ్చు అనుకున్నాడు లింగం.

వాడే బయటదేశం పోకపోతే ఈరోజు ఇల్లు ఇట్లుండేదేనా? నౌకరీ ఉన్న అల్లుడు నాకడపతొక్కేటోడేనా' అనుకున్నాడు లింగం.

అప్పుడే పోస్టుమెన్ కేక వినిపించి ఆతృతగా బయటకువచ్చాడు తండ్రి లింగం . సంతకం తీసుకుని పోస్టుమెన్ ఒక కవరును అందించి వెళ్ళిపోయాడు. ఆ కవరు కొడుకు వద్దనుండి వచ్చిందని గ్రహించాడు లింగం. విప్పి చూసాడు. యాభైవేయిల చెక్కుతో పాటు ఉత్తరం బయటపడింది. తను క్షేమమని, ఇప్పట్లో రావడం వీలుకుదరదని వ్రాసాడు ప్రభాకర్. డబ్బు లెక్క వ్రాయాల్సిన అవసరం లేదని అందరూ సంతోషంగా ఉంటే తనకు అదే చాలని వ్రాసాడు. చెల్లెలి పెళ్ళి చేసినందుకు సంతోషంగా ఉందని, తమ్ముళ్లిద్దర్ని బాగా చదివించాలని వ్రాసాడు. మొన్ననే చెల్లెలి పెళ్ళి అయింది కాబట్టి ఖర్చు లుంటాయని అందుకే తనదోస్తుల దగ్గర బదలు అడిగి డబ్బు పంపిస్తున్నానని, అప్పులుంటే కట్టేయాలని వ్రాసాడు.

"ఏంటిది...కొడుకుది కారటచ్చిందా" అంటూ ఇంట్లోంచి బయటకు వచ్చింది దేవవ్వ "అవును" అంటూ ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకోబోయాడు లింగం.

"గట్లలోపల పెట్టుకుంటున్నవేంది....? చదువు" అన్నది దేవవ్వ. అక్కడే ఇద్దరు కొడుకులు, కొత్తల్లుడు, కూతురు ఉన్నారు. అల్లుడు చనువుగా మామ చేతుల్లోంచి ఉత్తరం తీసుకుని చదవడం మొదలెట్టాడు. అందర్ని పేరు పేరునా గుర్తుచేసాక చెల్లెలి పెళ్ళికి తాను లేనని బాధపడవద్దని, కట్నకానుకలు లాంఛనాల వద్ద ఏ మాత్రం వెనక్కుపోకూడదని, బావగారు ఏది అడిగినా కాదనకూడదని, డబ్బుకు వెనకాడకూడదని, తమ్ముళ్ళను పెద్ద చదువులు చదివించాలని అందరు ఒక స్థాయికి వచ్చాకగానీ తాను తిరిగిరానని వ్రాసాడు. ఏవైనా వస్తువులు అవసరముంటే వ్రాయమని, ఇండియా వచ్చేవారితో పంపిస్తానని వ్రాసాడు.

ఉత్తరం చదివాక కొత్త అల్లుడి పెదాలపై నవ్వు మెరిసింది. రేబాన్ గ్లాసెస్ పంపించుమని భార్య చేత ఉత్తరం వ్రాయించాలనుకున్నాడు. తమ్ముళ్ళు చెల్లెల్లు అప్పటికప్పుడే తమ కోర్కెల లిస్టును బయట పెట్టారు. నాయిన్న లింగం మనసు మరోసారి బాధతో మూల్గింది. 'వీల్లకు వాడు ఇప్పుడు యాదికస్తుండు. ఇంత దాకా ఎవరైనా యాది చేసారా' అనుకున్నాడు.

''అన్న మస్కట్ పోయి ఐదేండ్లవుతుంది. ఒక్కసారన్నా బట్టలు పంపించలేదు. ఒక్కొక్కలయితే టేపురికార్డులు, కెమెరాలు పంపిస్తరు.'' రెండవ కొడుకు అన్నాడు.

''టీషర్టులు జీన్‌ప్యాంటులు అక్కడ మంచిగుంటయంట. అన్నను పంపియ్యిమనాలె'' రెండవ కొడుకు అన్నాడు.

తండ్రి లింగం మనసు కుతకుత లాడింది. చెక్కును భద్రంగా దాచిపెట్టాడు. దేవవ్వ అందరి మాటలు మౌనంగా విన్నది.

లింగంకు పెద్దకొడుకు ప్రభాకర్. ప్రభాకర్ పదవ తరగతివరకు చదువుకున్నాడు. ఆస్తిపాస్తులేం లేకపోవడంతో అంతటితో చదువును ఆపేసి ఏదైనా పని నేర్చుకోవాలన్నాడు లింగం. ప్రభాకర్ టైలర్ పని నేర్చుకోవాలనుకున్నాడు. వెంటనే టైలర్ వద్ద చేరాడు. రెండేండ్లలో పని పూర్తిగా నేర్చుకుని వేరుగా దుకాణం పెట్టుకున్నాడు. అప్పుడే చెల్లెలు మంగ పదవతరగతి ఫేలయింది. తమ్ములిద్దరు చదువుతున్నారు. వారిని బాగా చదివించాలని అనుకుననేవాడు ప్రభాకర్. కూతురు తల్లిదండ్రులిద్దరు ఆందోళన పడటం గమనించాడు. గల్ఫ్ వెళ్ళి డబ్బుబాగా సంపాదించి చెల్లెలి పెళ్ళి ఘనంగా చెయ్యాలని, తమ్ముళ్ళకు చదువు చెప్పించాలని కలలుగనేవాడు.

తెలిసిన ఏజెంటు దగ్గర పాస్‌పోర్ట్ పెట్టాడు. ఆరునెలల్లో వీజా వచ్చింది. ముందుగా వారించినా తర్వాత ఒప్పుకున్నాడు లింగం. అంతకుముందు లింగం కూడా నాలుగేండ్లు గల్ఫ్‌లో ఉండి వచ్చాడు. అక్కడ మెదులుకోవలసిన పద్ధతులన్నీ చెప్పి ప్లేన్ ఎక్కించాడు.

మంచి కంపెనీలోనే పని దొరికింది ప్రభాకర్‌కి. నెలకు పదివెయిల పైనే ఉంది జీతం. డబ్బు ఆరునెలలకొకసారి పంపించడం మొదలుపెట్టాడు. ఏడాదికే కంపెనీ మూతపడింది. అక్కడినుండి మరోచోటికి పారిపోయాడు ప్రభాకర్. వేరే కంపెనీలో పని కొరకు ప్రయత్నం చేసాడు. ముస్లింలకు తప్ప వేరే వారికి వీజాలు దొరకడం లేదు. ఇండియాలో ఉన్న మిత్రుల సహాయంతో ముస్లింపేరుమీద పాస్‌పోర్ట్ తెప్పించుకుని పేరు మార్చుకుని మరో కంపెనీలో పనిలో చేరారు. అందులో కూడా జీతం బాగానే ఉంది.

ఏడాదిలో బాకీలన్నీ తీరిపోయి డబ్బు నిలువకు వచ్చింది. మరో ఏడాది ఆగి లక్షరూపాయలు జమ అయ్యాక ప్రభాకర్ చెల్లెలి పెండ్లి చేయాలని చూసాడు. ఉద్యోగం ఉన్న వ్యక్తిని తప్ప పెండ్లి చేసుకోనని పట్టుబట్టింది మంగ. ప్రభాకర్‌కూడా చెల్లెలికి మంచి సంబంధం చూడాలని వ్రాసాడు.

అది తన తాహతుకు మించిన పని అని తెలుసు లింగంకు. కొడుకు డబ్బు పంపిస్తున్నాడు కాబట్టి సరిపోయింది. లేకుంటే ఉద్యోగస్థుడికిచ్చి ఎలా పెళ్ళి చేసేవాడు అనుకున్నాడు. చేతిలో డబ్బుంది కాబట్టి మంగ ఆ కోరిక కోరింది. తిండికే తిప్పలు పడుతుంటే ఈ కోరిక కోరేదేనా

అనుకున్నాడు. రెండేండ్లాగి కొంత అప్పుచేసి నాలుగు లక్షల కట్నమిచ్చి కూతురు కోరిన ప్రకారం ఉద్యోగస్తుడికిచ్చి పెండ్లి చేసాడు.

రెండవ కొడుకు టి.టి.సి. చేసి డిగ్రీపూర్తి చేసాడు. మూడవవాడు టి.టి.సి పూర్తి చేసాడు.

"యాభై వెయిల చెక్కు కూడా పంపినట్టున్నాడు గదా!" అల్లుడి మాటలతో తేరుకుని అవునన్నట్టు తలూపాడు లింగం.

"నాన్నా.....నాకసలు టి.టి.సి ఇష్టం లేదు. బలవంతంగా చేయించావు. నేను లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని మెడిసిన్‌కి ప్రిపేర్‌అవుతా. నన్ను గుంటూరు కాలేజీలో చేర్పించు." చిన్నవాడు అన్నాడు తండ్రితో. ఆ మాటలు ఏడాది క్రితం నుంచి అంటూనే ఉన్నాడతను.

"నేను ఎం.బి.ఏ.లో చేరుతా! నాకు పి.జి ఇష్టంలేదు. డొనేషన్ కట్టాలి." రెండవవాడన్నాడు. ఏమనుకుందో కాని కూతురు కూడా నోరువిప్పింది.

"నాన్నా....స్కూటర్ లేకపోతే ఇబ్బందిగా ఉంది. మనకుఇప్పుడు ఎలాగూ అప్పుల్లేవుగదా! చెక్కు డ్రా చేయగానే స్కూటర్ కొనివ్వు. అన్నకు నేను లెటర్ వేస్తా" గారాలు పోతూ అన్నది.

లింగం విస్తుపోయి చూస్తుండిపోయాడు. భర్త వైపు పిల్లల వైపు మార్చి మార్చి చూసింది తల్లి దేవవ్వ. ఇదంతా ఈ చెక్కు మహిమ. డబ్బు కనిపించగానే వీరికి ఏవేవో గుర్తుకొస్తున్నాయి అనుకున్నాడు లింగం.

"ఎంది మామయ్యా! గట్ల బీరుపోయింద్రు" అల్లుడి పిలుపుతో ఉల్కిపడ్డాడు లింగం. కళ్ళముందు పెద్దకొడుకు ప్రభాకర్ మెదిలాడు. కన్నవారికి ఊరికి దూరమై ఐదేండ్లు కావస్తుంది. ఏం తింటున్నాడో ఎలా ఉంటున్నాడో! రెక్కలు ముక్కలు చేసుకుని డబ్బు పంపిస్తున్నాడు. లింగంకు కళ్ళలో నీళ్లు తిరిగాయి. ఒక్కసారిగా తన గతం గుర్తుకొచ్చింది.

* * *

లింగంకు ఒక తమ్ముడు. ఒక చెల్లెలు. వృత్తి వ్యవసాయమే అయినా భూమి ఎక్కువగా లేదు. లింగం ఐదవతరగతి వరకు చదివాడు. కొన్ని రోజులు పశువుల కాపరిగా ఉన్నాడు. కొన్ని రోజులు బొంబాయి వెళ్ళి కూలిపని చేసాడు. కొన్ని రోజులు తండ్రివెంట వ్యవసాయం చేసాడు. రైతుల భూముల్ని కౌలుకు పట్టుకొని దున్నాడు. కొన్ని రోజులు పెద్ద రైతుకు జీతమున్నాడు. తనతో చదువుకున్న పెద్ద రైతుకొడుకును చూసినప్పుడల్లా అతడికి జీవితం మీద ఏదో తెలియని కసి పెరిగేది. అతడు ప్యాంటు, నిండుచేతుల చొక్కా వేసుకొని స్కూలుకు వెళ్తుంటే మనసు అదోలా అయిపోయేది. కొన్ని రోజుల తర్వాత ఆకసి మరుగున పడిపోయింది. అదే యేడు పెళ్ళయింది. వీరి ఆర్థికస్థితి గమనించి ఏజెంట్‌కు డబ్బు కట్టి లింగంను మస్కట్‌తోలించారు అత్తగారు. ఐదేండ్లున్నాడు లింగం. డబ్బు బాగానే సంపాదించాడు. అత్తగారిచ్చిన బాకీ తీర్చాడు. చెల్లెలి పెళ్ళి చేసాడు. తమ్ముడికి ఉద్యోగం దొరికింది. మూడెకరాల పొలం బావి, కరెంటు మోటారు కొన్నాక ఇంటికి వచ్చాడు. తమ్ముడు ఎవరికీ చెప్పకుండానే ఎవరో అమ్మాయిని పెళ్ళి చేసుకుని కరీంనగర్‌లో స్థిరపడిపోయాడు. తల్లిదండ్రులు ముసలివారైపోయారు. వారితో మూడెకరాల భూమిని సాగుచేసుకుంటూ ఇంటివద్దే ఉండిపోయాడు లింగం.

రెండేండ్లు గడవకుండానే తమ్ముడు ఆస్తిలో వాటా కోరాడు. తండ్రి చిన్నకొడుకును మందలించాడు. "వాడు కష్టపడి నిన్ను చదివించాడు. వాడేదేశం పోకపోతే నువ్వు ఎవ్వల దగ్గర జీతముందువు. నువ్వు తింటున్న తిండి, కడుతున్న బట్ట వాడు కష్టపడితే వచ్చినవేరా! నువ్వేమన్న ఐదుపైసలమాలు 'ఇగో అన్నా తీసుకో' అని ఇచ్చినావురా!" అన్నాడు తండ్రి.

లింగం తమ్ముడు ఇలాగైతే లాభంలేదని ఊరిలో పెద్ద మనుషులని కలిసాడు. లింగం అంటే గిట్టనివారు అతడికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం మొదలెట్టారు. నలుగురి చేత చెప్పించుకోవడం ఇష్టం లేక లింగం వెంటనే భూమిలో అరభాగం, ఇంటిలో అరభాగం పంచి ఇచ్చాడు. ఇల్లు చిన్నగా ఉండడంతో లింగంనే తీసుకొమ్మని కొంత డబ్బును మాత్రం చెల్లించాలని చెప్పారు పెద్దలు. లింగం అలాగే చేసాడు. పొలాన్ని మాత్రం తానే కౌలుకు తీసుకున్నాడు లింగం.

రెండేండ్లు గడిచాయి. తమ్ముడు కరీంనగర్‌లో ఇల్లు కట్టుకున్నాడు. అప్పు అయిందని పొలం అమ్ముతానన్నాడు. అప్పటికీ వర్షాలు లేవు. రెండు పసల్లు బీడుగానే ఉంది భూమి. బావిలో ఊరిన నీటితో తన భాగాన్ని మాత్రమే నాటు వేసుకుంటున్నాడు లింగం. చేనుకొనడానికి డబ్బుల్లేవు. అదే విషయాన్ని తమ్ముడికి చెప్పి ఏడాదిలోపు డబ్బు పూర్తిగా చెల్లిస్తానని వడ్డీకి కాగితం రాసిస్తానని చెప్పాడు.

తమ్ముడు ఒప్పుకోలేదు. తనకు డబ్బు నగదు కావాలన్నాడు. అలాచెల్లించకపోతే పక్కవారికి అమ్ముకుంటానన్నాడు. చేసేదిలేక అమ్ముకోమన్నాడు అన్న లింగం.

"ఒరేయ్.....అపొలం నిజంగా వాడి డబ్బుతో కొన్నదేరా! వాడు మంచివాడు కాబట్టి నీకు పాలు ఇచ్చాడు. అంతటితో ఆగిపోకుండా ఇప్పుడు పొలం పక్కవాడికి అమ్ముతావురా! అది పక్కవాడికి అమ్మితే ఏం జరుగుతందో తెలుసారా! కష్టమంటే ఏమిటో నీకు తెలియదు కాబట్టి ఆ విషయాలేవీ తెలియవు. పొలం కొన్న పక్కవాడు బోర్ వేస్తాడు. వాడు బోర్‌వేస్తే బావి ఎండిపోతుంది. పదివేయిలు పెట్టి అన్న కూడా బోర్ వేయాల్సుంటుంది. అందులో నీరు పడితే మరో ఇరవై వేయిలు పెట్టి మోటార్ తేవాలి. లేదు నీరు పడలేదనుకో. నిన్ను చదివించిన పాపానికి వాడింత ఎండ్రిన్ తాగాలి ఒరేయ్. తమ్ముడిని చదివిస్తే బాగుపడతాడనుకున్నాడు కానీ నువ్వు ఇలా బ్రతుకును కడతేరుస్తావను కోలేదురా వాడు. పామును పాలుపోసి పెంచినట్టు నిన్ను పెంచాడురా!" అన్నాడు తండ్రి ఏడుస్తూ.

అతడు మనసు మార్చుకోలేదు. తనకు డబ్బు అవసరం ఉందని అందుకే అమ్ముతున్నానని మాత్రం చెప్పాడు. లింగం పరిస్థితి చూస్తుంటే జాలివేస్తుంది తండ్రికి. అందుకే చిన్న కొడుకును బ్రతిమాలుతున్నట్టుగా అన్నాడు.

"చిన్నోడా! అన్న తండ్రెనుక తండ్రిరా! డబ్బు అవసరముంటే నువ్వు ఎట్లనన్న తింపుకోగలవు. యాడాది లోపు మిత్తితో ఇస్తనంటుండుగదరా! ఒక్కయాడాది ఓపికపట్టు. నీకు కోపమొస్తే కట్టెతో కొట్టు గని పొట్టమీద కొట్టకురా! వాడి బతుకు మీద దెబ్బగొడితే పిల్లల గోస తగులుతదిరా!" అన్నాడు తండ్రి. కానీ ఫలితం లేకపోయింది.

పక్క పొలంవారు లింగం తమ్ముని్ని ఎగదోసారు." మస్కట్ పైన మస్తుగ దాసుకున్నడు. పైకి ఏమీ లేనట్టు నటిస్తుండు. మీ అన్న ఎడ్డోడేం కాదు. నువ్వు గట్లేం అనుకోకు' అని బోధించారు.

అందరి మాటలు విని తండ్రిమాట అతడు వినలేదు. పొలం అమ్మేసి డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు. పొలం కొన్న వ్యక్తి లింగం బావిపక్కనే రెండు వందల ఫీట్ల బోర్ వేసాడు. రెండు రోజుల్లో బావిలోని ఊటంతా బోర్‌లోకి దిగిపోయింది. తనుకూడా బోర్ వేద్దామంటే లింగం చేతిలో డబ్బు లేదు. కలుపుకు వచ్చిన పైరు ఎండిపోయింది. వ్యవసాయం మీద మనసు విరిగిపోయింది లింగంకు. వెంటనే తనవంతు పొలంకూడా అమ్మేసాడు. మళ్ళీ గల్ఫ్ వెళ్ళాలని ప్రయత్నించాడు. డబ్బు బాగానే ఖర్చయింది. విసా మాత్రం దొరకలేదు. మూడెకరాల రైతు లింగం రైతు కూలీగా మిగిలిపోయాడు. తను మస్కట్ వెళ్ళకముందు కంటే హీనంగా మారిపోయారు.

కొన్ని రోజులకు పెద్దకొడుకు ప్రభాకర్ చేతికి అందివచ్చాడు. మస్కట్ వెళ్ళాడు. డబ్బు పంపిస్తున్నాడు. ఆ డబ్బుతోనే కూతురు పెళ్ళయింది. తన కొడుకుల చదువులయ్యాయి.

* * *

అలా ఏదో ఆలోచనలోపడి పోయాడు లింగం.

"వాళ్ళు ఏదో మాట్లాడుతున్నారు. నువ్వేమో బెల్లం కొట్టిన రాయిలెక్క ఉన్నవు. ఔననవు. కాదనవేంది!" అడిగింది దేవవ్వ. కొత్తల్లుడు ఏమిటని అడిగినా అతడు మౌనంగా ఉండి పోవడంతో దేవవ్వకు విసుగ్గా అనిపించింది. అల్లుడు ఏమన్న అనుకున్నాడేమోనని భయంగా ఉందామెకు. అదే క్షణంలో భర్త కళ్ళల్లోని తడిని కూడా చూసింది దేవవ్వ. వెంటనే కంగారుగా అడిగింది.

"ఏందయ్యా! ఏమైంది. కొడుకుయాదికచ్చిండా..?"

"కొడుకు కాదే...నా తమ్ముడు యాదికచ్చిండు. మా నాయిన యాదికచ్చిండు. నేను మస్కట్ పోయి సంపాయించిన డబ్బు యాదికచ్చింది. నువ్వూ నేనూ పిల్లలూ ఉపాసం పన్న రోజులు యాదికచ్చినయి" బాధగా అన్నాడు.

అతడి మనసులో ఏముందో అర్థమైపోయింది దేవవ్వకు. ఆమె కళ్ళు కూడా చెమ్మగిల్లాయి. పిల్లలు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. తండ్రి ఏమంటున్నాడో వారికి అర్థం కాలేదు. అల్లుడు మామగారిచ్చే స్కూటర్‌ను ఊహించుకుంటూ గంభీరంగా కూర్చున్నాడు. తమ చదువుల గురించి తండ్రి ఏం చెప్పడం లేదని ఎదురు చూస్తున్నారు పిల్లలు.

కూతురు మాత్రం అప్పుడే పెద్దరికం వచ్చినదానిలా అన్నది.

"ఏమిటినాన్నా.....స్కూటర్ అని అడుగంగనే గట్లయితివి. ఇయ్యకపోతే ఇయ్యకపోతివి తియ్యి. అన్న గట్లరాసిండుగదా అని అడిగిన . నేనే బ్యాంక్‌నెంబర్ తీసి అన్నకు పంపి పైసలు పంపుమంట. నేను అడిగితే కాదంటాడా."

కొడుకులిద్దరూ తండ్రివైపు ఉత్కంఠంగా చూస్తున్నారు. తమ చదువుకయ్యే డబ్బు ఎక్కడ అక్కఎగరేసుకుపోతుందోనని వారికి బాధ కలిగింది.

లింగం గబగబా లోపలికెళ్ళి పాస్‌బుక్‌తో వచ్చాడు. అల్లుడూ, కూతురు, కొడుకు అన్న ధ్యాసలేదిప్పుడు. పెద్ద కొడుకే కళ్ళముందు మెదులుతున్నాడు. పాస్‌బుక్‌ను కొడుక్కిచ్చి ఎంత పంపింది లెక్కచేయమన్నాడు. డ్రా చేసిన డబ్బును లెక్కవేసి ఐదు లక్షల ఇరవైఅయిదు వేలు

అని చెప్పాడు కొడుకు. బ్యాంక్‌లో బ్యాలెన్స్ ఎంత ఉందని అడిగాడు లింగం. ఆరు వందల డెబ్బైఐదు అని చెప్పాడు ఎమ్.బి.ఏ. చదువుతానన్న కొడుకు.

"చూసారా! మీ కొరకు ఖర్చుచేసిన డబ్బుఐదు లక్షల ఇరవైఅయిదు వేలు. ఐదేండ్లువెట్టి చాకిరి చేసి అడ్డమైనోనికి గులాంగిరి చేస్తే వాడికి మిగిలింది ఆరువందల డెభై. మీరిద్దరు టీచర్ ట్రైనింగ్ చేసారు. నేడుకాకపోయినా రేపైనా ఉద్యోగం చేస్తారు. నీకు ఉద్యోగస్తుడైన భర్త ఉన్నాడు. ఎవరికీ ఎదురుచూడకుండా బ్రతగ్గలవు. వాడి గతేంటని ఒక్కసారి ఆలోచించారా! రేప్పొద్దున వాడు ఇక్కడికి వస్తే తెల్లారిన్నుండే మిషినికుడితేతప్ప కడుపులకురాదు. నాకుబదులియ్యండ్రి, అప్పు ఇయ్యండ్రి అని మీ ఇండ్ల పొంటివస్తే మీరిస్తరా! వాడిని దగ్గరికి తీస్తరా! చేతులో డబ్బు లేదని తెలిసాక వాడి మొహం చూస్తరా!

ఎవరూ మాట్లాడలేదు. అల్లుడు కూతురు మొహం మాడ్చుకున్నారు.

"ఇప్పటినుండి వాడి డబ్బు వాడి పేరు మీదనే వేస్తాను. ఇప్పటికే మీకు చాలా ఖర్చు చేసాను. చదువు కోవాలనుకున్నవారు ప్రైవేటు స్కూల్లో పనిచేస్తూ చదువుకోండి. లేదంటే ఇంటికాడ కూసుండి చదివి ఎంట్రెన్స్‌రాసి సీటు సంపాయించుకోండ్రి. కాదంటే ఊర్కోండ్రి. చిట్టవ్వా! నీకు ఇవ్వాల్సిందంతా ఇచ్చాను. స్కూటర్ కావాలంటే మీ ఆయనను కొనుక్కోమను. నేను ఇలా మాట్లాడుతున్నానని మీకు కోపంగా ఉండవచ్చు. ఇంటికి పెద్దోడుగా నేను కూడా చిన్నప్పుడు చాలా బాధ్యతల్ని మోసాను. నా మూలంగా పైకివచ్చిన వారెవరూ నావైపు కన్నెత్తి చూడలేదు. ఇరవై ఏళ్ళక్రితం మా తండ్రి కూడా నాలాంటి నిర్ణయం తీసుకుని ఉంటే చిన్నతనంలో మీరు ఆకలి కడుపుల్తో పడుకునేవారే కాదు." అంటూ నీరసంగా కుర్చీలో కూర్చున్నాడు నాయిన్న లింగం.

చిన్న కొడుకు కస్సుబుస్సు లాడుతూ వెళ్ళిపోయాడు. రెండవవాడు తండ్రి వైపు కోపంగా చూసాడు. కూతురు మొహం చిన్నబుచ్చుకుంది. అల్లుడు ముభావంగా లేచి బట్టలు వేసుకున్నాడు. ఎంత వారించినా వినకుండా అప్పటికప్పుడు తయారై భార్యతో సహా వెళ్ళిపోయాడు.

"ఏంటిది.....? నీకియ్యాల్ల ఏమైంది. పండుగ పండుగోలె లేకుండ జేస్తివి. అట్లనకపోతే ఏమాయె. వాళ్ళందరూ అలిగిపోయిరి." దిగులుగా అన్నది దేవవ్వ.

"పోతే పోనీయే. వాల్లు ఎటుపోయినా మంచిగనే బతుకుతరు. పెద్దోడే ఎట్ల బతుకుతడు ఆలోచించు. ఇట్ల ఖర్చుపెట్టుకుంటూ పోతే ఇంక ఐదేండ్లయినా ఖర్చులు పెరుగుతయి గని తగ్గయి. మన బతుకు ఎట్లయిందో ఒక్కసారి నువ్వు ఆలోచించు" స్థిరంగా అన్నాడు లింగం.

దేవవ్వలో దిగులు మాయమైంది. భర్తవైపు తృప్తిగా చూసింది. దుమ్ము పట్టిన పెద్దోడి ఫోటోను కొంగుతో తుడిచి ముద్దుపెట్టుకుంది దేవవ్వ.